ప్రజాశక్తి
సోమవారం 9 జూన్ 2025
5
విజయనగరం

యోగాంధ్రపై నేడు ర్యాలీలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

యోగా మాసంలో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమంపై ర్యాలీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్.. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని గ్రామాలు, వార్డుల్లో ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు ప్రజలను భాగస్వామ్యం చేస్తూ యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన కలిగించాలని చెప్పారు. ఆయా ర్యాలీల్లో గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులంతా పాల్గొనాలని సూచించారు. నగరంలో బాబామెట్టలోని దేవి పార్కు నుంచి ర్యాలీ నిర్వహిస్తున్నట్టు ఆయుష్ అధికారి ఎం.ఆనందరావు తెలిపారు.

'ప్రయివేటు'కే షైనింగ్ స్టార్?

ప్రభుత్వ విద్యార్థులకు మొండిచేయి ● నేడు అవార్డులను ప్రదానం చేయనున్న మంత్రులు

షైనింగ్ స్టార్.. ప్రతిభే కొలమానంగా పేర్కొంటూ పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన అవార్డు ఇది. అలాంటి అవార్డులకు ఎంపిక విధానం లోపభూయిష్టంగా తయారైంది. ప్రభుత్వ విద్యార్థులకు పెద్దపీట వేయాల్సిన చోట.. వారికి అన్యాయం చేస్తున్నారు. ప్రయివేటు విద్యాసంస్థలను ప్రోత్సహిస్తూ అందలమెక్కిస్తున్నారు. ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఇలాంటి అవార్డులు ప్రకటించి, వాటి అభివృద్ధికి ప్రత్యక్షంగా సహకరిస్తున్నారని చెప్పేందుకు ఈ అవార్డుల ఎంపికే తార్కాణం. అవార్డుల ఎంపిక ప్రక్రియపై జిల్లా వ్యాప్తంగా విమర్శలు వస్తున్నాయి.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు ఇచ్చి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు ఈ అవార్డులు ప్రదానం చేస్తారు. అవార్డుకు ఎంపికైన విద్యార్థులకు రూ.20 వేలు నగదు, పతకం, సర్టిఫికెట్ అందిస్తారు. ఈ అవార్డులను సోమవారం మంత్రుల చేతుల మీదుగా అందజేసేందుకు జిల్లా విద్యా శాఖ సిద్ధమైంది. పదో తరగతిలో మండల స్థాయిలో ఆరుగురిని ఎంపిక చేస్తారు. వీరిలో ఒసి, బిసిలు ఇద్దరు చొప్పున, ఎస్‌సి, ఎస్‌టిలను ఒక్కొక్కరు చొప్పున ఎంపిక చేస్తారు. అదనంగా జిల్లా స్థాయిలో 70 శాతానికి పైగా మార్కులు సాధించిన ప్రత్యేక అవసరాలు కలిగిన ముగ్గురు విద్యార్థులను అవార్డుకు ఎంపిక చేస్తారు. నిబంధనలు చెప్పడానికి, వినడానికి చక్కగా ఉన్నాయి.. ఇందుకు భిన్నంగా విద్యార్థుల ఎంపిక ప్రక్రియ సాగిందనే విమర్శలు వెలువెత్తు తున్నాయి. పథకం గొప్పదే అయినా కార్పొరేటు విద్యాసంస్థలకు ఫలితం దక్కేలా ఊడిగం చేసేలా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. అవార్డులకు ప్రయివేటు పాఠశాలల విద్యార్థులను ఎంపిక చేసి, ఆ పాఠశాలల ఉన్నతికి మరింత ఉపయోగపడేలా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇంటర్‌లో 46 మంది ఎంపిక

ఇంటర్‌లో గ్రూపుల వారీగా ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి, ఎంఇసి, ఒకేషనల్ గ్రూపుల్లో విద్యార్థులను ఎంపిక చేశారు. వారిలో ప్రభుత్వ కళాశాలల నుంచి 17 మంది, ప్రయివేటు కళాశాలల నుంచి 29 మంది విద్యార్థులు ఉన్నారు.

ప్రభుత్వ బడుల విద్యార్థులకు అన్యాయం

జిల్లాల్లో ప్రభుత్వ విద్యార్థులకు అన్యాయం జరిగిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుకు సగానికిపైగా ప్రయివేటు విద్యాసంస్థల విద్యార్థులు ఎంపిక కావడమే నిదర్శనమని పలువురు చెబుతున్నారు. జిల్లాలో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతో మంది ఉన్నారు. ప్రభుత్వ విద్యార్థులను ఎంపిక చేయకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇదేమి ఎంపిక? అనే విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ప్రయివేట్ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులకు 589 మార్కులు వస్తే, ఎంపిక చేసి రివార్డులు, అవార్డులు ఇవ్వడం ఎందుకని, దీన్ని ప్రోత్సహించడం వెనుక ఏ ఉద్దేశం దాగి ఉందో? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

ఎంపికైన విద్యార్థుల వివరాలు	
గవర్నమెంట్	1
జెడ్‌పి హైస్కూళ్లు	52
మోడల్ స్కూళ్లు	17
ఎపి గురుకులాలు	8
గిరిజన గురుకులాలు	2
కెజిబివి	5
బిసి వెల్ఫేర్	8
ప్రయివేటు స్కూళ్లు	65
మొత్తం విద్యార్థులు	**158**

ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలి, ప్రోత్సహించాలి తప్ప ప్రయివేట్ విద్యార్థులకు ఎందుకు రివార్డులు ఇవ్వాలనే సందేహాలు వస్తున్నాయి. అదే మార్కులు వచ్చిన ప్రభుత్వ విద్యార్థులను వెనుకబాటుకు గురిచేయడం, ప్రభుత్వ పాఠశాలలను క్రమక్రమంగా నిర్వీర్యం చేసే కుట్రలు ఉన్నట్లు తెలుస్తోందని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వ అవార్డుల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పెద్దపీట వేయాలి తప్ప ప్రయివేట్ విద్యార్థులను ప్రోత్సహించి జిల్లా స్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డులో వెనుకబడిన విద్యార్థులకు అదే మార్కులు వచ్చినా ఎంపిక కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై ఇప్పటికే ఫిర్యాదులు కూడా కొంతమంది చేసినట్లు తెలుస్తోంది. ప్రయివేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఒసి కేటగిరిలో 580 మార్కులు దాటితే ఎంపిక చేసి, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 580 మార్కులు పొందిన వెనుకబడిన తరగతుల విద్యార్థులను ఎందుకు ఎంపిక చేయడం లేదని పలువురు బాహాటంగా ప్రశ్నిస్తున్నారు.

కార్పొరేట్లకు ఊడిగమే

ప్రభుత్వ పాఠశాలల్లో పేద, వెనుకబడిన తరగతుల విద్యార్థులు చదువుతున్నారు. వారిని ప్రోత్సహించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి. అంతే తప్ప ఇలాంటి అవార్డులు ఇచ్చి ప్రయివేట్ పాఠశాలలను ప్రోత్సహించడం అంటే ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేయడమేనని, ఈ విధానం ఇలాగే కొనసాగితే ప్రభుత్వ పాఠశాలలు క్రమక్రమంగా మూసివేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ప్రతి మండలానికి ఒసి 2, బిసి రెండు, ఎస్‌సి, ఎస్‌టిలకు ఒక్కొక్కటి చొప్పున అవార్డులు ఇవ్వాలి. ఇలాంటి ప్రభుత్వ పథకాల వల్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులలో మానసిక ఆత్మస్థైర్యం దెబ్బతిని తిరిగి ప్రయివేట్ పాఠశాలలను ఆశ్రయిస్తారని, ప్రభుత్వ కార్యక్రమంలో ఏ పథకమైనా మొదట ప్రభుత్వ విద్యార్థులకు ప్రథమ స్థానం ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. ఇకనైనా ప్రభుత్వ విద్యార్థులకు న్యాయం చేసి, మండలాలు వారీగా అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఉపాధ్యాయులు

కదంతొక్కిన ఉపాధ్యాయులు

- కలెక్టరేట్ ముట్టడి , రాస్తారోకో
- ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలి
- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌జిటిలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాల్సిందేనని ఉపాధ్యాయులు కదంతొక్కారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ఆదివారం ముట్టడించారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్‌కు ఉపాధ్యాయులు చేరుకున్నారు. డిఇఒ కార్యాలయాన్ని ముట్టడించేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని, కలెక్టరేట్ గేట్లు మూసివేశారు. దీంతో కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ఉపాధ్యాయులు బైఠాయించారు. ఆన్‌లైన్ కౌన్సిలింగ్ వద్దు, మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ప్రభుత్వం దిగొచ్చే వరకూ కౌన్సిలింగ్‌లో పాల్గొనేది లేదని తెగేసి చెప్పారు. ఉపాధ్యాయులతో ఆడుకోవాలని చూస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కలెక్టరేట్ రెండు గేట్లు మూసివేయించి ముట్టడి కొనసాగించారు. ఒంటిగంట సమయంలో కలెక్టరేట్ కూడలిలో రాస్తారోకో నిర్వహించి, ముట్టడి కార్యక్రమం ముగించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, నాయకులు రమేష్‌చంద్ర పట్నాయక్, డి.రాము, కె.విజయగౌరి, పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్ర నాయుడు, డి.శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర మీడియా ఇన్‌ఛార్జి బంకపల్లి శివప్రసాద్, ఎస్‌టియు నాయకులు డి.శ్యామ్, జోగారావు, సూరిబాబు, ఎపిటిఎఫ్-1938 రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు, పైడిరాజు, ఆపస్ జిల్లా అధ్యక్షులు కె శ్రీనివాసరావు, డిపిఆర్‌టియు నాయకులు పి.శ్రీనివాసరావు, ఎస్.నాగేశ్వరరావు, ఎపిటిఎఫ్ -257 నాయకులు పి.శ్రీనివాస, ఆప్టా రాష్ట్ర అధ్యక్షులు గణపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసభ్యకర వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రాజధాని అమరావతి మహిళల గురించి అసభ్యకరంగా ప్రచారం చేసిన సాక్షి మీడియా యాజమాన్యంపై చర్య తీసుకోవాలని తెలుగు మహిళా విభాగం నాయకులు ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు చేసిన వారిలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు కొర్నాన రాజ్యలక్ష్మి, కార్యదర్శి వీర లక్ష్మి, సభ్యులు పత్తిగుల్ల సూర్యకుమారి, ఎస్.ఝాన్సీ, వి.సూర్యకుమారి, ఎస్.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున ; బాధ్యతలు స్వీకరిస్తున్న డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ

కొలువుదీరిన చైర్మన్లు

రైతులకు తోడ్పాటు : నాగార్జున

కంటోన్మెంట్ : డిసిసిబి ద్వారా వ్యవసాయ రంగానికి, రైతులకు తోడ్పాటు అందించేందుకు కృషి చేస్తానని చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. ఆదివారం స్థానిక ప్రయివేటు కల్యాణ మండపంలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్‌గా ఆయన బాధ్యతలను స్వీకరించారు. డిసిసిబి సిఇఒ ఉమామహేశ్వరరావు ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నాగార్జున ప్రమాణం చేస్తూ, డిసిసిబి అభివృద్ధికి తన సాయిశక్తులా కృషి చేస్తానన్నారు. చైర్మన్‌గా తనకు అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తానని చెప్పారు. డిసిసిబి చైర్మన్‌గా అత్యున్నత ప్రమాణాలను పాటిస్తానని, సేవలను విస్తృతం చేస్తానని చెప్పారు.

డిసిసిబి, డిసిఎంఎస్ చైర్మన్లుగా కిమిడి నాగార్జున, గొంప కృష్ణ కొలువుదీరారు. ఈ మేరకు ఆదివారం వారు బాధ్యతలు స్వీకరించారు. వారికి ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి, కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్ గజపతిరాజు, ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కిమిడి కళావెంకటరావు, కోండ్రు మురళీమోహన్, కోళ్ల లలితకుమారి, లోకం నాగమాధవి, అదితి గజపతిరాజు, బోనెల విజయ్‌చంద్ర, మాజీ మంత్రి కిమిడి మృణాళిని, మాజీ ఎమ్మెల్యేలు ఆర్‌పి భంజ్‌దేవ్, కిమిడి గణపతిరావు, కె.ఎ.నాయుడు, తదితరులు అభినందనలు తెలియజేశారు.

డిసిఎంఎస్ సేవలు విస్తృతం : కృష్ణ

విజయనగరం టౌన్ : డిసిఎంఎస్ సేవలను విస్తృతం చేయడం ద్వారా బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చైర్మన్ గొంప కృష్ణ అన్నారు. స్థానిక డిసిఎంఎస్ కార్యాలయంలో ఆదివారం అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో ఆయన డిసిఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో డిసిఎంఎస్ జిల్లా మేనేజర్ సాయికుమార్ సంతకాలు చేయించి, బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా కృష్ణ మీడియాతో మాట్లాడుతూ చైర్మన్‌గా తనకు ప్రభుత్వం నుంచి లభించే గౌరవ వేతనం, ఇతర అలవెన్స్‌లు తీసుకోబోనని, ఆ డబ్బును డిసిఎంఎస్‌ను బలోపేతం చేసేందుకు వినియోగిస్తానని ప్రకటించారు. డిసిఎంఎస్ ఫలాలను అందరికీ అందించేందుకు సాయశక్తులా కృషి చేస్తానన్నారు. పార్టీ విజయం కోసం తాను పడిన కష్టానికి ప్రతిఫలంగా ఈ పదవిని అందించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, మంత్రి నారా లోకేష్‌కు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై డ్రోన్ నిఘా

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నగరంలోని శివారు ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపై పోలీసులు డ్రోన్ల సహాయంతో దాడులు చేపడుతున్నారు. ఓపెన్ డ్రింకింగ్‌కు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకొని, కేసులు నమోదు చేశారని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. విజయనగరం వన్, టుటౌన్ పోలీసులకు వచ్చిన కచ్చితమైన సమాచారంతో పూల్‌బాగ్ కాలనీ నందిగుడ్డి, కనపాక, అయ్యన్నపేట ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై డ్రోన్ల పంపి, దాడులు చేపట్టినట్లు తెలిపారు. 11 కేసులను నమోదు చేశామన్నారు. పేకాట, ఓపెన్ డ్రింకింగ్, జాతరల్లో అనుమానాస్పద వ్యక్తుల ఆచూకీని కనిపెట్టేందుకు డ్రోన్ వినియోగిస్తున్నామని తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిని అరెస్టు చేస్తున్న పోలీసులు

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

- నూతన విద్యా సంవత్సరం ప్రారంభానికి చర్యలు
- ఆహ్లాదకరంగా పాఠశాలలు ఉండేలా ఏర్పాట్లు
- 'ప్రజాశక్తి'తో డిఇఒ యు.మాణిక్యం నాయుడు ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'ఈ నెల 12న పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం పాఠశాలల్లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. సౌకర్యాలు, నాణ్యమైన విద్యను అందించడం ద్వారా ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించడమే ధ్యేయమ'ని జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యంనాయుడు తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో చేస్తున్నట్లు ఏర్పాట్లు, తీసుకుంటున్న చర్యలను అందులో వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

ఈ ఏడాది విద్యార్థులకు స్వాగత ఏర్పాట్లు ఏ విధంగా ఉన్నాయి.?

విద్యా సంవత్సరం ప్రారంభం రోజు పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఆహ్లాదకర వాతావరణంలో అడుగుపెట్టేలా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే పాఠశాలలు పరిశుభ్రంగా ఉండేలా, చక్కని వాతావరణం కల్పించేలా చర్యలు చేపట్టాం. విద్యార్థులకు ఎటువంటి సమస్యలూ లేకుండా ఫర్నిచర్, సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నాం.

నూతన విద్యా సంవత్సరంలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు చేపట్టిన చర్యలు ఏమిటి.?

2025-26 విద్యా సంవత్సరంలో విద్యా ప్రమాణాలు మెరుగుదలకు పాఠశాలల ప్రారంభం నుంచే చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు రెండు విడతలుగా సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు బోధనపై శిక్షణ ఇస్తున్నాం. పాఠశాలల ప్రారంభం నాటికి బోధనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు, మెలకువలు, సబ్జెక్టుల వారిగా వివరించేందుకు ఉపాధ్యాయులకు రెండు దశల్లో శిక్షణ సాగుతోంది. మొదటి విడత ఈ నెల 4 నుంచి 6 వరకు పూర్తయింది. రెండో విడత 6 నుంచి 9వ తేదీ వరకు కొనసాగుతోంది.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ఎటువంటి ప్రణాళికలు అమలు చేస్తున్నారు.?

ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు జూన్ మొదటి వారంలోనే గ్రామాల్లో ప్రచారం చేపట్టాం. ఈ వారమంతా ఉపాధ్యాయులు ఆ పనిలో ఉంటారు. దీంతోపాటు అంగన్వాడీలో చదివిన పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించే ప్రక్రియ సాగుతోంది. ప్రభుత్వం విద్యార్థులకు అందించే సౌకర్యాలు, విద్యా బోధన గురించి వివరించి, గత ఏడాది కంటే ఎక్కువ మంది చేరేలా కృషి చేస్తున్నాం.

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పూర్తి అయిందా? అన్ని పాఠశాలల్లో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు ఉన్నారా.?

అన్ని తరగతుల్లో ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించాం. ఉపాధ్యాయుల లోటు లేకుండా సర్దుబాటు ప్రక్రియ చేపడుతున్నాం. 49 మంది విద్యార్థులకు ఒక సెక్షన్ అమల్లో ఉంటుంది. అక్కడ నుంచి 50, 90, 130.. ఇలా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సెక్షన్లు పెంచుతాం. ఇది హైస్కూల్‌లో అమలు చేస్తాం.



బదిలీల ప్రక్రియ ఎంతవరకు వచ్చింది.?

ఉమ్మడి జిల్లా ఆధారంగా బదిలీలకు 4973 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వారిలో హెచ్‌ఎంలు 100, ఎస్‌జిటి 2604, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం 125, స్కూల్ అసిస్టెంట్లు 2114, పిఇటిలకు 30 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికి హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లు, పీడీల బదిలీలు పూర్తయ్యాయి. ఇంకా ఎస్‌జిటిలు, పండిట్లు, పిఇటిలు బదిలీలు జరగాల్సి ఉంది. రెండు రోజుల్లో ఈ బదిలీలు కూడా పూర్తయ్యే అవకాశముంది.

ఎంతమందికి ఉద్యోగోన్నతులు కల్పించారు.?

47 మంది స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పించి, వారికి స్కూళ్లు కేటాయించాం. ఖాళీ ఏర్పడిన స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అర్హత కలిగిన ఎస్‌జిటిలు 49 మందికి ఉద్యోగోన్నతులు ఇచ్చాం.

తల్లికి వందనం ప్రక్రియ ఎంత వరకు వచ్చింది.?

తల్లికి వందనం పథకం గురించి మాకు అధికారికంగా ఎటువంటి సమాచారమూ రాలేదు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వాటి వివరాలు అందిస్తాం.

ఈ ఏడాది నుంచి పాఠశాలలు విభజిస్తున్నట్లు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది , ఏ విధంగా విభజన చేపట్టారు.?

ఈ ఏడాది ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 9 రకాలు పాఠశాలలు అమల్లో ఉంటాయి. అందుకు అనుగుణంగా పాఠశాలలు విభజించాం. శాటిలైట్ ఫౌండేషన్ స్కూళ్లు, ఫౌండేషన్ స్కూళ్లు, బేసిక్ ప్రైమరీ స్కూళు,, మోడల్ ప్రైమరీ స్కూళ్లు, అప్పర్ ప్రైమరీ స్కూళు,, హై స్కూళ్ళు, హైస్కూల్ క్లాస్ 1 నుంచి 10వ తరగతి, హై స్కూల్ ప్లస్ 6వ తరగతి నుంచి 12 తరగతి వరకు, హై స్కూల్ ప్లస్ 1 నుంచి 12వ తరగతి వరకు ఇలా విభజించాం.

ఫలితాల మెరుగుదలకు ఎటువంటి ప్రణాళికలు అమలు చేయనున్నారు.?

ఈ ఏడాది విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు మెరుగైన ఫలితాల సాధన కోసం విద్యా సంవత్సరం ఆరంభం నుంచే సబ్జెక్ట్ టీచర్లకు బాధ్యత అప్పగిస్తాం. పాఠ్యాంశాలు బోధించిన వెంటనే అదనపు స్టడీ అవర్స్ నిర్వహించడం, జరిగిన ప్రతి పాఠంపై పరీక్ష పెట్టడం వంటి ప్రణాళికలను అమలు చేస్తాం. పదో తరగతిలో కూడా గత ఏడాది కంటే మెరుగ్గా ఫలితాలు ఉండేలా కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తాం.

లోహ జగత్తు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చాగంటి తులసి, తదితరులు

లోహ జగత్తు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

లోహ జగత్తు పుస్తకాన్ని ప్రముఖ రచయిత్రి చాగంటి తులసి ఆవిష్కరించారు. చాగంటి కృష్ణకుమారి రచించిన ఈ పుస్తకాన్ని ఆదివారం నగరంలోని తన నివాసంలో తులసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చాగంటి తులసి మాట్లాడుతూ మానవ శరీరం అనేక లోహ మూలకాలు సమూహమని, ఆయా లోహాలు శరీరం ఎదుగుదలకు, క్షీణతలపై ఏవిధంగా ప్రభావితం చేస్తాయో లోహ జగత్తు పుస్తకంలో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో వివరించారని చెప్పారు. తెలుగులో సరళమైన భాషలో లోహ జగత్తు పుస్తకం.. కథా కథనంలో ప్రజలకు అందుబాటులోకి రావడం వల్ల విద్యార్థులకు విషయ పరిజ్ఞానం సముపార్జనకు ఉపయుక్తంగా ఉంటుందని రచయిత సుమనస్పతి రెడ్డి వివరించారు.

సైన్సు అభివృద్ధి సమాజంపై ప్రభావం చూపిందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఎంవిఆర్ కృష్ణాజీ తెలిపారు. కథా కథనానికి అనుగుణంగా చిత్రాలు వేయడంతో లోహాల ప్రయోజనం తెలుసుకోవడం సులభమైందని చిత్రకారిణి కె.మధురశ్రీ తెలిపారు. సాహితీ స్రవంతి నిర్వాహకులు చీకటి దివాకర్ సంధాన కర్తగా వ్యవహరించారు ఈ కార్యక్రమంలో ఎంఆర్ మహిళా కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ లలితకుమారి, చిత్రకారుడు చాసో కుమారుడు చాగంటి బాపిరాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి మురుగునీరు

అధ్వానంగా రైల్వే స్టేషన్ రహదారి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రైల్వేస్టేషన్ మార్గంలో ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. కాలువ ద్వారా వెళ్లాల్సిన మురుగంతా రోడ్డుపైకి చేరుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా కాలువలను శుభ్రం చేయకపోవడం, చెత్త పేరుకోవడం వల్ల కాలువ ద్వారా వెళ్లాల్సిన నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. గత కొంత కాలంగా కాలువను శుభ్రం చేయకపోవడం వల్ల ఇలా తయారైంది. వెంటనే నగరపాలక సంస్థ అధికారులు స్పందించి కాలువను శుభ్రం చేసి, దుర్వాసన నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపైకి చేరిన మురుగునీరు

సాగునీటికి సొంత ఖర్చులు

ఈ ఏడాది ఖరీఫ్ నాటికి రైతులకు ఎక్కడా సాగునీటి కష్టాలు లేకుండా చూడండి, ప్రాజెక్టులకు సంబంధించిన శివారు భూములకు కూడా సాగునీరు పుష్కలంగా అందించాలి అని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా అధికారులకు పట్టడం లేదు. కనీసం మరమ్మతులకు గురైన ప్రాజెక్టులకు సంబంధించిన షెట్టర్లను కూడా బాగు చేసే పరిస్థితిలో అధికారులు లేరంటే అతిశయోక్తి కాదు. అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతోంది. ఖరీఫ్ ముంచుకొస్తున్నా ఇరిగేషన్ అధికారులు ఇప్పటి వరకూ సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇటీవల కురిసిన వర్షాలకు సాగునీటి ప్రాజెక్టుల్లో నీరు చేరినా రేగిడి మండలం సాయన్న ఛానల్ వంటి సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన షెట్టర్లను బాగు చేయకపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. ఫలితంగా సాగునీటి ప్రాజెక్టు కింద ఉన్న రైతుల్లో గుబులు మొదలైంది. ఖరీఫ్ ప్రారంభించిన నాటికి ప్రాజెక్టు గేటులు, షెట్టర్లు మరమ్మతులు చేపట్టాలని చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడంతో సొంత డబ్బులు ఖర్చు చేసి వాటిని బాగుచేసుకునే పనిలో రైతాంగం కుస్తీ పడుతోంది.

- ఆధునీకరణకు నోచుకోని సాయన్న హెడ్ ఛానల్
- కనీస మరమ్మతులు చేపట్టని యంత్రాంగం
- రెగ్యులేటర్‌కు షట్టర్లు లేక సాగునీరు వృథా
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- చందాలు వేసుకుని మరమ్మతులకు సిద్ధమవుతున్న ఆయుకట్టు రైతులు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి సాయన్న హెడ్ ఛానల్ ఆధునీకరణ పనులకు నోచుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిటిష్ నాటి సాయన్న ఛానల్ రేగిడి మండలంతో పాటు సంతకవిటి మండలాలకు సంబంధించి 11,600 ఎకరాలకు సాగునీరు అందించేది. ఈ సాయన్న ఛానల్ 1990 మే నెల 12న వచ్చిన నాగావళి వరదలకు కొట్టుకుపోయి వీటి రూపు రేఖలే మారిపోయాయి. సాయన్న ఛానల్ కాలువలకు సంబంధించి చిట్ట గెడ్డ రెగ్యులేటర్, పెద్ద ఫూన్, తిరుగుడు ఫూన్‌తో పాటు వీటికి సంబంధించి అనుబంధ పిల్ల కాలువలకు షట్టర్లు లేక సాగునీరు వృథాగా పోవడంతో ఏడాదికి మూడు పంటలు పండించే భూములకు సాగునీరు లేక, వర్షాలు పూర్తిస్థాయిలో పడక ఖరీఫ్ వ్యవసాయం చేయలేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

మరమ్మతులకు గురైన షెట్టర్లు

బ్రిటిష్ నాటి సాయన్న హెడ్ కాలువకు సంబంధించి చిట్ట గెడ్డ రెగ్యులేటర్‌కు నాలుగు ఇనుప షెట్టర్లు పూర్తిగా పాడైపోవడంతో సాగునీరు వృథాగా నాగావళి నదిలోకి వెళ్లిపోతోంది. దీంతో పంటలు పండించేందుకు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఏటా రైతులు శ్రమదానం చేసి సాగునీరు తెచ్చుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు. మరికొన్ని సందర్భాల్లో రైతులు సొంత డబ్బులు పెట్టుకుని మరమ్మతు పనులు చేపట్టుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు ఉన్నట్టా.. లేనట్టా..

సాయన్న హెడ్ ఛానల్‌కు ఇరిగేషన్ అధికారులు, లస్కర్లు పర్యవేక్షణ లేకపోవడంతో అసలు అధికారులు ఉన్నట్టా.. లేనట్టా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఏటా సమస్య వస్తున్నా అధికారులు పట్టించుకోపోవడం విడ్డూరంగా ఉందని చెబుతున్నారు. ఆధునీకరణ పనులు చేపట్టేందుకు, నీరు వృథా అరికట్టేందుకు ఇనుప షట్టర్ల కోసం ప్రస్తుత నీటి సంఘం అధ్యక్షులు నారు జనార్ధనరావు జిల్లా కలెక్టర్, ఎమ్‌పి, ఎమ్మెల్యేలు, అధికారులకు ఎన్నో అర్జీలు చేసుకున్నప్పటికీ పట్టించుకునే దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆధునీకరణ పనులకు, ఇనుప షెట్టర్ల వేసేందుకు నిధులు మంజూరు చేపట్టాలని పాలకులను, ప్రభుత్వ అధికారులను రైతులు కోరుతున్నారు.

వృథాగా పోతున్న సాగునీరు

షెట్టర్లు వేయాలి

బ్రిటిష్ నాటి సాయన్న ఛానల్‌కు ఆధునీకరణ పనులు చేయాలి. సాగునీటి ఇబ్బందులు ఉన్నాయి. రెగ్యులేటర్లకు ఇనుప షెట్టర్లు పాడై సాగునీరు వృథాగా పోయి నాగావళి నదిలోకి కలిసిపోతుంది. ఖరీఫ్ వ్యవసాయానికి సాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిలు అందించిన పట్టించుకోలేదు.

నారు జనార్ధనరావు, నీటి సంఘం అధ్యక్షులు, సంకిలి.

నీరు వృథాగా పోతోంది.

సాయన్న ఛానల్, దాని నుంచి వచ్చే కాలువలకు షెట్టర్లు లేక సాగునీరు వృథాగా పోతుంది. ఎన్నోసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. ఇలా అయితే పంటలు పండించలేం. రైతే రాజు అని చెప్పి ఇలా చేయడం అన్యాయం. ఇప్పటికైనా పాలకులు ప్రభుత్వ అధికారులు స్పందించి ఆధునీకరణ పనులు చేపట్టాలి.

దుంగ సూర్య నారాయణ, రైతు, సంకిలి.

ప్రతిపాదనలు పంపించాం

సాయన్న ఛానల్ వాటికి సంబంధించి చిట్టగెడ్డ రెగ్యులేటర్, తిరుగుడు ఫూన్, పెద్ద ఫూన్, ఇతర పిల్ల కాలువల పనులకు ప్రతిపాదనలు పంపించాం. కానీ నిధులు మంజూరు కాలేదు. నిధులు వచ్చిన వెంటనే పనులు చేస్తాం. ప్రస్తుతం రైతులు సాగునీరు కోసం ఇబ్బందులు పడుతున్నారు. రైతులు నిధులు సమకూర్చి షెట్టర్లు వేసుకుంటామని చెబుతున్నారు.

గనిరాజు, ఇరిగేషన్ డిఇఇ, పాలకొండ.

యువత స్వయం ఉపాధిపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. ఆదివారం స్థానిక మొయిద జంక్షన్‌లో కాఫీ డే షాప్‌ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత వారు చదువుకున్న డిగ్రీతో ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూడకుండా స్వయం శక్తితో ఎదిగి మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా అన్ని రంగాల్లో మరింత ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు లోకం ప్రసాద్, పూతికపేట మాజీ సర్పంచ్‌లు యడ్ల గోవింద రావు, యడ్ల కొండమ్మ, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

మాన్యువల్ కౌన్సెలింగ్ అమలు చేయాలి

ప్రజాశక్తి- రామభద్రపురం

ఎస్‌జిటిలకు మొదటి నుంచి మ్యాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి దానికి కట్టుబడకుండా వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ఏపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు ప్రశ్నించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహిస్తే ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. అన్ని సంఘాలు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని మొదటి నుంచి కోరుతున్నామని అయినప్పటికీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల వందల మంది ఎస్‌జిటిలు రోడ్లు మీదకు వచ్చి డిఇఓ కార్యాలయాన్ని ముట్టడి చేస్తూ ఆందోళన చేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకోకపోవడం అధికారుల అసమర్థత కారణమని, ఇప్పటికైనా ప్రభుత్వం మాన్యువల్ కౌన్సిలింగ్ షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపిటిఎఫ్ నాయకులు బంకురు జోగినాయుడు, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడ, రామతీర్థం, విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి వ్యవసాయ కనెక్షన్ పనులు కొనసాగుతున్నందున ఈ నెల 9న విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. సతివాడ 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో రామతీర్థం 11 కెవి రూరల్ ఫీడర్, ఒమ్మి రూరల్ ఫీడర్ పరిధిలో వ్యవసాయ కనెక్షన్ నిర్మాణ పనుల కొనసాగింపు, చెట్లు తొలగించడం, సాంకేతిక సమస్యలు పరిష్కారం కోసం మధుపాడ, పినతరిమి,పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బొడ్డపేట, బుచ్చన్నపేట, ఒమ్మి, మాల్యాడ, వెంకన్నపాలెం, గ్రామాలకు సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మారికకు కరెంటొచ్చిందోచ్..!

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలోని మారికకు ఎట్టకేలకు కరెంటొచ్చింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలు కారణంగా గ్రామం గత మూడు రోజులుగా అంధకారంలో ఉంది. దీంతో 'మూడు రోజులుగా అంధకారంలో' అనే కథనం ప్రజాశక్తి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎలక్ట్రికల్ ఎఇ సిబ్బందితో హుటాహుటిన అక్కడకు పంపించి గ్రామానికి కరెంట్ వచ్చేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామస్తులు ప్రజాశక్తికి అభినందనలు తెలిపారు.

విద్యుత్తును సరిచేస్తున్న సిబ్బంది

ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపర్తి ఎస్‌సి కాలనీలో బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రముఖ దళిత నాయకుడు వాల్తేటి పెంటారావు ఆదివారం ఆవిష్కరించారు. సర్పంచ్ సేనాపతి లీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహాలు ఆవిష్కరించడం కాదని, ఎస్‌సి కులస్తులందరూ ఐకమత్యంగా ఉన్న నాడే ఆయన ఆశయాన్ని సాధించగలమని చెప్పారు. చాలామంది దళిత నాయకులు అంబేద్కర్ సంఘాలు స్థాపించి రాజకీయ నాయకులకు తొత్తులుగా వ్యవహరించి కుటుంబాలను పోషించుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని చదువుకున్న యువకులు గ్రహించాలన్నారు. మండలంలో దళితుల భూములు అన్యాక్రాంతమవుతుంటే స్థానికంగా ఉన్న దళిత నాయకులు ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. జై భీమ్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి - సంతకవిటి

మండలంలోని శ్రీహరినాయుడు పేట గ్రామంలో ఆసిరితల్లి నీలమ్మతల్లి ఆలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ మేరకు గ్రామంలో భక్తులు ఘటాలను ప్రతిష్టించారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు బదిలీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సహాయ గ్రంథాలయ అధికారిగా పనిచేస్తున్న కె.శ్రీనివాస్‌కు గంట్యాడ లైబ్రేరియన్‌గా బదిలీ అయింది. జిల్లా కేంద్రంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎ.ఆదిమూర్తిని గంట్యాడ లైబ్రేరియన్ పోస్ట్ ఖాళీ అవడంతో అక్కడకు డెప్యుటేషన్‌పై పంపించారు. ప్రస్తుతం ఆయన్ను రిలీవ్ చేసి, విజయనగరం రికార్డ్ అసిస్టెంట్‌గా తిరిగి నియమించారు.

గజమాలతో గొంప కృష్ణను సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

'గొంప'కు అడుగడుగునా నీరాజనం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం లిమిటెడ్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయటానికి గొంప కృష్ణ ఆదివారం ఎస్‌కోట పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి ర్యాలీగా జామి మీదుగా విజయనగరం వెళ్లారు. ఈ సందర్భంగా గొంప కృష్ణకు ఎస్‌కోట టిడిపి నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో సత్కరించారు. అనంతరం మండలంలోని సీతమ్మ పేట, వినాయకపల్లి, గ్రామ మహిళలు తీన్మార్ డప్పులతో, పూలు జల్లుతూ హారతులు పట్టి అభినందనలు తెలిపారు. జామి మండలంలోని చింతాడ, పావాడ, జాగరం తదితర గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వాగతం పలుకుతూ హారతులు పడుతూ బాణాసంచాను కాల్చారు. జాగరంలో గొంప కృష్ణకు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేపాడ: విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం లిమిటెడ్ చైర్మన్‌గా గొంప కృష్ణ చేపట్టిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మండల టిడిపి అధ్యక్షులు గొంప వెంకటరావు, నియోజకవర్గ టిడిపి మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, మండల ఐటిడిపి అధ్యక్షుడు సేనాపతి గణేష్ ఆధ్వర్యంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు ఆదివారం పెద్దఎత్తున హాజరయ్యారు. కార్లు, బైక్‌లు, ఆటోలపై ర్యాలీగా ప్రమాణస్వీకారం తరలి వెళ్లారు.

దేవుని కనపాకలో కార్డాన్ సెర్చ్

- ఆకస్మిక తనిఖీలు చేపట్టిన పోలీసులు
- ఒకేసారి అన్ని ఇళ్లు, బహిరంగ ప్రదేశాల్లో సోదాలు
- 400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి - కంటోన్మెంట్, గుర్ల

ప్రజల రక్షణ, భద్రత, నేరాలు, నాటుసారా అక్రమ రవాణ నియంత్రణే లక్ష్యంగా గుర్ల పోలీసు స్టేషను పరిధిలోని దేవుని కనపాక గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున 5 గంటలకు చీపురుపల్లి సిఐ శంకరరావు ఆధ్వర్యంలో సర్కిల్ పోలీసు అధికారులు, సిబ్బంది ' కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ నిర్వహించి, ఇండ్లలోను, బహిరంగ ప్రదేశాల్లో ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శంకరరావు మాట్లాడుతూ చీపురుపల్లి సర్కిల్, గుర్ల పోలీసు స్టేషను పరిధిలోగల దేవుని కనపాక గ్రామంలో నాటుసారా నియంత్రణకు 'కార్డన్ అండ్ సెర్చ్' నిర్వహించామన్నారు. గ్రామంలో నివాసం ఉన్న అనుమానిత వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసేందుకు, ప్రజల రక్షణకు భరోసా కల్పించేందుకు గుర్ల, గరివిడి, బుదరాయవలస ఎస్‌ఐలు, 35 మంది పోలీసు సిబ్బందితో బృందాలుగా ఏర్పడి గ్రామంలోను, గ్రామ శివార్లలోను సోదాలు నిర్వహించామన్నారు. గ్రామంలో అన్ని ఇండ్లలో ఆకస్మికంగా సోదాలు నిర్వహించి, అవరిచత వ్యక్తుల వివరాలు సేకరించి, వారి వేలి ముద్రలను ఎంఎస్‌సిడి పరికరాలతో తనిఖీలు చేసామన్నారు. వారి వద్ద లభించిన వాహనాల రికార్డులను పరిశీలించి, రికార్డులు సక్రమంగాలేని ఆరు ద్విచక్ర వాహనాలను తదుపరి చర్యల నిమిత్తం గుర్ల పోలీసు స్టేషనుకు తరలించామన్నారు. అనుమానిత వ్యక్తులు పారిపోయేందుకు అవకాశం ఉన్న మార్గాలను ముందుగా గుర్తించి, ఆయా మార్గాలను పోలీసు బృందాలతో ముందుగానే దిగ్బంధనం చేసామన్నారు. ప్రజల రక్షణ, భద్రతకు భరోసా కల్పించాలని, నాటుసారా తయారీని నియంత్రించాలనే లక్ష్యంతోనే ఈ 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ నిర్వహించామని చెప్పారు. ఈ తనిఖీల్లో గ్రామంలోని శివారు ప్రాంతాల్లో నాటుసారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి, ధ్వంసం చేసామన్నారు. రాబోయే రోజుల్లో ఇదే తరహాలో జిల్లాలో మరికొన్ని ప్రాంతాల్లో 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్స్ ఆకస్మికంగా చేపట్టనున్నామన్నారు. ఈ ఆపరేషను తరువాత గ్రామస్థులతో సమావేశమై, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, నాటుసారా తయారీకి, అక్రమ రవాణకు స్వస్తి పలకాలని, ఉపాధి పొందేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్ల ఎస్‌ఐ పి.నారాయణరావు, గరివిడి ఎస్‌ఐ లోకేశ్వరరావు, బుదరాయవలస ఎస్‌ఐ లోకేష్, 35 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

దళిత బాలికపై అత్యాచారం అమానుషం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

దళిత బాలికపై అత్యాచారం చేయడం అమానుషమని జైభీం రావు భారత్ పార్టీ నాయకులు టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాస రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతం ఎడుగురాలు పల్లిలో దళిత బాలికపై టిడిపికి చెందిన అల్లరి మూకలు దాడి చేసి అత్యాచారం చేయడం దారుణమన్నారు. అదే బాలికపై వీడియోలు ఉన్నాయంటూ బెదిరించి 14మంది అత్యాచారం జరిపి గర్భవతిని చేసి గ్రామం నుంచి వెళ్లగొట్టడం సభ్యసమాజానికి సిగ్గు చేటన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా దళితులు, ఆదివాసీలు, మైనార్టీలపై దాడులు అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. తక్షణమే ప్రభుత్వం దళిత మైనార్టీ బాలికపై దాడి చేసిన వారు ఎంతటి వారైనా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వారితో పాటు చిన్నం అరుణ్ కుమార్ ఉన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

కాలువల నిర్మాణానికి సహకరించండి

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

మండలంలోని పురిటిపెంట, మెంటాడ రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. ఆ రోడ్డులో ఉన్న వ్యాపారులతో ఆయన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షం పడితే మెంటాడ రోడ్డు మొత్తం చెరువులను తలపిస్తుందని, దీనివల్ల వాహనదారులు, పాదాచారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనికి పరిష్కార దిశగా కాలువలు నిర్మించడానికి వ్యాపారాలంతా సహకరించాలని కోరారు. ఈ క్రమంలో వ్యాపారులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో మాజీ జెడ్‌పిటిసి మక్కువ శ్రీధర్, ప్రదీప్ కుమార్, ఎస్. రామ్ కుమార్, మండల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - బొబ్బిలి

అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈనెల 9,10,11న జరగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ బంకురు ప్రసాద్ చెప్పారు. సబ్ జూనియర్ విభాగాల్లో ఎన్.హర్షిత, బి.వరలక్ష్మి, క్యాడియట్ విభాగంలో బి భరద్వాజ్, జూనియర్ విభాగాల్లో బి.గౌతమి, పి.సంజన, సోమేష్ యాదవ్, బి.శివరామకృష్ణ, సీనియర్స్ విభాగంలో కె అభినవ్, వై. కిషోర్ కుమార్, బి.రోహిత్, ఎస్.కిరణ్ పాల్గొంటున్నట్లు తెలిపారు. బొబ్బిలి శ్రీకళాభారతి ఆడిటోరియంలో గత నెల 31న జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు వీరంతా అర్హత సాధించారని ఆయన తెలిపారు. క్రీడాకారులను ఎమ్మెల్యే బేబినాయన అభినందించారు.

పారా స్పోర్ట్స్ చైతన్య యాత్ర పోస్టరు విడుదల

రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు క్రీడలలో కల్పిస్తున్న అవకాశాలను రాష్ట్రమంతటా వివరిస్తూ చేపట్టిన పారా స్పోర్ట్స్ చైతన్య యాత్ర ఆదివారం బొబ్బిలి చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబినాయన పారా స్పోర్ట్స్ చైతన్య యాత్ర పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తీసుకున్న చారిత్రక నిర్ణయం ఎంతో గొప్పదని, దీని వల్ల ఎందరో వికలాంగులకు గొప్ప అవకాశాలు లభిస్తాయని అన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాలపై వికలాంగులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టిన రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్, పారా స్పోర్ట్స్ రాష్ట్ర అధ్యక్షులు గోనుగుంట్ల కోటేశ్వరరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బొబ్బిలి కోటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు రౌతు రామ్మూర్తి నాయుడు, జెసి రాజు మాస్టారు, టిడిపి వికలాంగుల విభాగం రాష్ట్ర కార్యదర్శి చీమల రాంబాబు, రాష్ట్ర పారా స్పోర్ట్స్ సెక్రటరీ రామస్వామి, జిల్లా పారా స్పోర్ట్స్ గౌరవ అధ్యక్షులు దయానంద్, విశాఖపట్టణం జిల్లా పారా స్పోర్ట్స్ అధ్యక్షురాలు షీతల్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి : జెవివి

ప్రజాశక్తి- బొబ్బిలి

శాస్త్రీయ దృక్పథం పెంపొందించి, సమాజంలో విజ్ఞాన శాస్త్రం అభివృద్ధికి కృషి చేయడమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యం అని రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.రాజగోపాల్ అన్నారు. స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ భవనంలో జెవివి నాయకులు శంబంగి శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నియోజకవర్గం జెవివి సమావేశంలో ఆయన మాట్లాడారు. జెవివి రాష్ట్ర మహాసభలు విజయనగరంలో సెప్టెంబర్ నెలలో నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా జరిగే అనేక ఈవెంట్స్‌ని ఏవిధంగా నిర్వహించాలో వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ ప్రభాత్ మాట్లాడుతూ విజ్ఞాన మేళాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆర్థిక వనరులు సమీకరణ వంటి అంశాలపై మాట్లాడారు. జిల్లా ఉపాధ్యక్షులు పి.సత్యంనాయుడు మాట్లాడుతూ జిల్లా మహాసభలను జయప్రదం చేసుకోవాలని, సదస్సులు, సెమినార్‌లు, విద్యారంగం పరిణామాలపై నిర్వహిస్తామని, జయప్రదానికి అందరూ సహకరించాలని కోరారు. ప్రణాళికా బద్ధంగా అనేక కార్యక్రమాలు జయప్రదానికి సహకరిస్తామని జెవివి నాయకులు శివానంద్, రమణమూర్తి, శ్రీనివాస్, కృష్ణదాసు, రాంబాబు, శశిభూషణ్, యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు విజయగౌరి, ప్రసన్నకుమార్ అన్నారు. పర్యావరణ పరిరక్షణకు బహుముఖ కార్యక్రమాలు నిర్వహించాలని కార్యకర్తలు కోరారు.

మాట్లాడుతున్న రాజగోపాల్

అయ్యా.. లోకేష్ గారూ..

వీరబొబ్బిలి రోడ్లు దుస్థితి చూడండి

ప్రజాశక్తి- బొబ్బిలి

అయ్యా లోకేష్ గారూ.. వీర బొబ్బిలి రోడ్లు పరిస్థితిని ఒకసారి చూడండి. వీటి కోసం ఎమ్మెల్యే బేబినాయన అసెంబ్లీలో చెప్పారు.. కానీ ఇప్పటికీ ఆర్అండ్‌బి, మున్సిపల్ అధికారులు స్పందించలేదు.. ప్రజలు నరకయాతన పడుతున్నారు.. మీరైనా నిధులు కేటాయించండి.. అని కొప్పల వెలమ సంక్షేమ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల జగన్ బొబ్బిలి రానున్న మంత్రి లోకేష్‌ను ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. బొబ్బిలి పట్టణ, నియోజకవర్గం రోడ్లు ప్రజలకు నరకం చూపిస్తున్నాయి. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ మా బొబ్బిలి రోడ్లు నరక యాతన స్వయంగా చూసి రోడ్లు కష్టాల నుంచి విముక్తి కల్పించాలని జగన్ కోరారు. మంత్రి లోకేష్ పార్వతీపురం జిల్లా పర్యటన నేపథ్యంలో ఆయన ఈ రకంగా విజ్ఞప్తి చేశారు..

గోతులమయమైన బొబ్బిలి రోడ్డు

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం ఎస్‌కోట మండలం కాపు సోంపురం గ్రామానికి చెందిన రొంగలి లక్ష్మి (25) పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసులు కథనం ప్రకారం.. కాపు సోంపురం గ్రామానికి చెందిన ఎర్రయ్యతో లక్ష్మికి గతంలో వివాహ మైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. వీరిద్దరూ ఎస్‌కోటలోని ఎస్‌టి బాలుర వసతి గృహంలో చదువుతున్నారు. ఇటీవల లక్ష్మి, తన భర్త ఎర్రయ్యతో గొడవ వేరుగా ఉంటూ విశాఖ పట్నంలో పనికోసం వెళ్లింది. అక్కడ వేపాడ మండలం సోంపురం గ్రామానికి చెందిన గేదెల ఖాళీతో ఆమెకు పరిచయమైంది. ఈ పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. అప్పటికే అవివాహితుడుగా ఉన్న ఖాళీ లక్ష్మిని పెళ్లి చేసుకుంటానని నమ్మ బలికి విశాఖపట్నంలో కొంతకాలం తనతో కాపురం చేశాడు. ప్రస్తుతం తనను దూరం పెట్టడంతో ఆమె వల్లంపూడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీంతో ఇరువురి గ్రామ పెద్దలను పోలీసు స్టేషన్‌కు పిలుపించగా ఆమె ఎవరో తమకు తెలియదని కాపు సోంపురం పెద్దలు అనడంతో మనస్థాపానికి గురైన లక్ష్మి పక్కనే ఉన్న కొబ్బరికాయలు దుకాణం వద్ద పెట్రోల్ కొనుక్కొని ఒంటిపై పోసుకుని నిప్పంటిం చుకుంది. వెంటనే స్పందించిన స్థానికులు మంటలను అదుపు చేసి 108 ద్వారి ఎస్‌కోట ప్రభుత్వాస్పత్రికి తరలించామని ఎస్‌ఐ సుదర్శన్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని గౌరీపురం గ్రామానికి చెందిన సేనాపతి సాయికుమార్ (26) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ గంగరాజు తెలిపారు. ఇటీవల కాలంలో తరచూ కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఆ బాధను భరించలేక ఈనెల రెండవ తేదీ రాత్రి సాయికుమార్ గడ్డి మందు తాగాడు. ఇది తెలుసుకున్న అతని తండ్రి సేనాపతి అప్పారావు సాయికుమార్‌ను వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. ప్రథమ చికిత్స అనంతరం విశాఖపట్నంలోని కిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స అనంతరం ఇంటికి తీసుకొని వచ్చారు. ఆదివారం తెల్లవారు జామున సుమారు రెండు గంటల ప్రాంతంలో సాయికుమార్‌కు మళ్లీ విపరీతమైన కడుపునొప్పి రావడంతో ఇంటి దగ్గరే చనిపోయాడని సాయికుమార్ తండ్రి సేనాపతి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు

నేరాలు ఘోరాలు

గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని బొడ్డవర చెక్ పోస్టు వద్ద ఆదివారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా విశాఖపట్నంకు చెందిన ఎస్.ఆశిష్ కుమార్, ఎం.లికిత్‌లు స్కూటీ మీద ఒక కేజీ 810 గ్రాముల గంజాయిని అరకు నుండి విశాఖపట్నం ఆక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడగా వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వి నారాయణమూర్తి తెలిపారు.